# 18048 దాటితే ర్యాలీ




**గత వారం:** మార్కెట్ అంతర్ర్కితం ధోరణిని వదలి లాభాల బాట పట్టింది. సానుకూల అంతర్జాతీయ మార్కెట్ల నేపథ్యంలో ఇది సాధ్యమైంది. రిజర్వు బ్యాంకు ఆశ్చర్యకర రీతిలో కీలక రేట్లను పెంచడంతో సోమవారం మార్కెట్లు బలహీనంగా ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 17396 వద్ద గతవారపు కనిష్ఠ స్థాయిని తాకింది. ఆ తర్వాత అంతర్జాతీయ మార్కెట్లు రికవరీ బాట పట్టడంతో కొనుగోళ్లు కొనసాగాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎమ్ఎఫ్) ఈ ఏడాది భారత వృద్ధి రేటును 9.4 శాతంగా అంచనా వేయడం; ద్రవ్యోల్బణం 12.63 శాతానికి పరిమితం కావడం; రుతుపవనాలు తిరిగి పుంజుకోవడం వంటి సానుకూల పరిణామాలతో శుక్రవారం 17858 వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. వారం మొత్తం మీద 373 పాయింట్ల లాభంతో 17834 వద్ద ముగిసింది.

**ఎఫ్ఐఐల తీరు:** విదేశీ సంస్థాగత మదుపుదార్లు(ఎఫ్ఐఐలు) రూ.1153 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా.. ఫండ్లు సైతం రూ.36 కోట్ల నికర కొనుగోళ్లనే చేశాయి.

**రంగాల వారీగా:** వరుసగా మూడో వారమూ మన్నికైన వినిమయ వస్తువుల సూచీనే అత్యధిక లాభాలను అందుకుంది. అంతర్ర్కితం వారం విక్రయాలకు గురైన ఐటీ, స్థిరాస్తి రంగాలు తక్కువ స్థాయిల్లో లభ్యం కావడంతో మదుపర్లు ఆసక్తి ప్రదర్శించారు. టెలికాం సైతం పుంజుకుంది. ఆర్‌పవర్, ఆర్ఎన్ఆర్ఎల్‌ల విలీన నిష్పత్తి మార్కెట్‌కు రుచించకపోవడంతో చమురు-సహజవాయువు షేర్లు నష్టాల బారి నపడ్డాయి. విద్యుత్, ఎఫ్ఎమ్‌సీజీ స్క్రిప్‌లు అధిక స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు గురయ్యాయి. లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:2గా నమోదవడం కొనుగోళ్లపై ఆసక్తి పెరిగిందనడాన్ని సూచిస్తోంది.

**ఈ వారంపై అంచనాలు:** గత వారపు మార్కెట్ 13 వారాల గరిష్ఠ స్థాయి వద్ద ముగియడం ప్రస్తుత మార్కెట్ సెంటిమెంటు బలంగా ఉందనడాన్ని సూచిస్తోంది. రెండేళ్ల గరిష్ఠ స్థాయి అయిన 18048 కంటే పైన ముగిస్తే మాత్రం 19000 దిశగా మార్కెట్ ర్యాలీ కొనసాగవచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** సోమవారం(నేడు) విడుదల కానున్న ఐఐపీ గణాంకాలు; ద్రవ్యోల్బణం గణాంకాలు(తగ్గితే ఆర్‌బీఐ తన పరపతి విధాన సమీక్షలో రేట్లు పెంచుతుందన్న ఆందోళనలు నెమ్మదిస్తాయి); త్రైమాసిక ఫలితాలు(ముఖ్యంగా 13నాటి ఇన్ఫోసిస్ ఫలితాలు); 17న ఇంధన ధరలపై జరగనున్న ప్రభుత్వ రంగ రిఫైనరీల సమావేశం వంటివి ప్రభావం చూపనున్నాయి. ధరల నియంత్రణ తొలగింపు అవకాశం అంచనాల నేపథ్యంలో చక్కెర షేర్లపై మార్కెట్ దృష్టి సారించొచ్చు.అంతర్జాతీయంగా ఎఫ్ఐఐల ధోరణి, యూఎస్ పారిశ్రామిక, నిరుద్యోగ గణాంకాలు వంటివీ ప్రభావం చూపొచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 17536, 17396, 17277; **తక్షణ నిరోధ స్థాయిలు:** 18048, 18274, 18593

**18048 స్థాయి పైన మార్కెట్ ముగిస్తే మాత్రం మరింత ర్యాలీని అంచనా వేయొచ్చు.**

*–సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*